సాక్షి నిజామాబాద్

బుధవారం : 14 : ఫిబ్రవరి : 2024



జేఈఈలో మెరిసిన విద్యార్థులు

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు.

- 8లో ▸



ఉద్యోగాల పేరిట మోసం

ఉద్యోగాల పేరిట యువతకు గాలం వేసి, ఆన్‌లైన్ ద్వారా గొలుసు దందా నడిపిస్తూ మోసాలకు పాల్పడుతున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.6 /20.5

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరగవచ్చు. ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత తగ్గుతుంది.

స్వచ్ఛమైన ప్రేమకే విలువ







చర్చా వేదికలో పాల్గొన్న వైద్య విద్యార్థులు

ముందు కెరియర్.. తర్వాతే ప్రేమ.. పెళ్లి

- ప్రేమికులు ఒకరినొకరు గౌరవించుకోవాలి
- ప్రేమ పేరుతో దాడులు సరికాదు
- 'సాక్షి' చర్చా వేదికలో మెడికల్ కాలేజీ విద్యార్థులు

నేడు ప్రేమికుల దినోత్సవం

నిజామాబాద్‌నాగారం : రెండు మనసులను కలిపే మంత్రం ప్రేమ.. కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాలు.. అన్ని హద్దులను చెరిపేసి ఇద్దరిని ఒకటి చేసేది ప్రేమ.. స్వచ్ఛమైన ప్రేమకు అవధులు లేవు.. నమ్మకంతో కూడిన ప్రేమకే విలువ ఉంటుంది.. అయితే ముందు కెరియర్ ముఖ్యమని తర్వాతే ప్రేమ.. పెళ్లి అంటున్నారు విద్యార్థులు.. నేడు వాలంటైన్స్ డే సందర్భంగా మంగళవారం 'సాక్షి' ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో నిర్వహించిన చర్చా వేదికలో విద్యార్థులు తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ప్రేమ పెళ్లి అయినా.. పెద్దలు కుదిర్చిన వివాహం అయిన ఇరువురు ఒకరినొకరు గౌరవించుకోవాలంటున్నారు. ప్రేమించే సమయంలోనే కాకుండా పెళ్లి తర్వాత కలిసి మెలిసి సవాళ్లు ఎదుర్కొంటు ముందుకు సాగాలని సూచిస్తున్నారు. ప్రేమ పేరుతో దాడులు చేయడం సరికాదంటున్నారు.. ప్రేమ దక్కలేదని ఆత్మహత్యలు చేసుకోకుండా భవిష్యత్ కోసం కష్టపడాలని సూచిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ ఇందిర, సాక్షి బ్యూరో ఇన్‌చార్జి తుమాటి భద్రారెడ్డి, కళాశాల వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతగా ఉండాలి



జీవితంలో కష్టాలు, ఇబ్బందులు ఉన్నా లేకున్నా... స్వతహాగా తనకు తానే ఎదగాలి. నచ్చిన వృత్తిలో ఏర్పరుచుకున్న లక్ష్యాల సాధనకు కృషి చేయాలి. పోటీ ప్రపంచంలో ఉన్నతంగా జీవించాలంటే ముందుకు కెరియర్‌పైనే దృష్టి పెట్టాలి. ముఖ్యంగా ప్రేమ పట్ల అప్రమత్తంగా ఉండాలి. ఏదీ తప్పు.. ఏదీ ఒప్పో గ్రహించి సరి చేసుకోవాలి. బాధ్యతతో కూడిన గౌరవం ఉంటే అనుకున్నా లక్ష్యాలను సాధించవచ్చు. ఆ తర్వాతే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచన చేయాలి.

– డాక్టర్ ఇందిర, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ

ఎదిగిన తర్వాతే ఆలోచించాలి



సమాజంలో ఏం జరుగుతుంలో గమనించాలి. ఏ విషయంలోనైనా స్వతంత్రంగా ఆలోచించే స్థాయికి ఎదగాలి. అప్పుడే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచన చేయాలి. లవ్ మ్యారేజ్ అయినా, పెద్దలు కుదిర్చిన వివాహం అయినా సరే ఆర్థికంగా ఎదురయ్యే కష్టాలు, ఇబ్బందుల గురించి ఆలోచన చేయాల్సిందే.

– అమృత, ఎంబీబీఎస్ సెకండియర్

ఒప్పించి పెళ్లి చేసుకోవాలి



ఇద్దరి మధ్య స్వచ్ఛమైన ప్రేమ ఉంటేనే ముందుకు వెళ్లాలి. ప్రేమ పేరుతో అనవసరమైన ఇబ్బందులు, దాడులు చేసుకోవద్దు. నిజమైన ప్రేమకు కచ్చితంగా పెద్దల సహకారం ఉంటుంది. ప్రేమకు ఎంత విలువ ఇస్తున్నారో కుటుంబానికి కూడా అంతే గౌరవం ఇవ్వాలి. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకోవాలి.

– శ్రావ్య, ఎంబీబీఎస్ సెకండియర్

వ్యసనాలకు బానిస కావొద్దు



ప్రస్తుతం యువత, విద్యార్థులు లవ్ పేరుతో వ్యసనాలకు బానిస అవుతున్నారు. ప్రేమించ లేదని, లవర్ మోసం చేశారని డ్రగ్స్, గంజాయి, మద్యానికి బానిస అవుతున్నారు. ప్రేమే జీవితం కాదు. అందరికి నచ్చేలా కాకున్నా ఎవరికి వారే లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు వెళ్లాలి.

– లవ్‌జ్యోత్, ఎంబీబీఎస్ ఫస్టియర్

ప్రేమంటేనే బాధ్యత



ప్రేమంటేనే బాధ్యత అనే విషయాన్ని గుర్తించాలి. ప్రేమించే సమయంలో ఉన్న ప్రేమ.. పెళ్లి అయినా తర్వాతా ఉండడం లేదని చాలామంది గొడవ పడుతుంటారు. అహానికి పోకుండా ఇద్దరు ఒకరినొకరు అర్థం చేసుకొని జీవించాలి.

– నువ్వుల విజయసాయి రామకృష్ణ, ఎంబీబీఎస్ సెకండియర్

అర్థం చేసుకోవాలి



ప్రేమలో ఇద్దరు ఒకరినొకరు అర్థం చేసుకునే స్వభావం ఉండాలి. ఈ మధ్య కాలంలో ప్రేమ పేరుతో వేధించడం, దాడులు చేయడం చూస్తునే ఉన్నాం. ముఖ్యంగా సోషల్ మీడియా పరిచయాలతో ప్రేమించి.. ఇంట్లో చెప్పకుండా వెళ్లి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. అందుకే ప్రేమ, పెళ్లి ఏదైనా సరే కరెక్ట్ పర్సన్‌ను ఎంచుకోవాల్సిందే. ముఖ్యంగా సోషల్ మీడియా పట్ల అప్రమత్తత చాలా అవసరం.

– శ్రీజ, ఎంబీబీఎస్ సెకండియర్

దాడులు సరికాదు



ప్రస్తుతం టీవీ ఛానల్స్, పత్రికల్లో ప్రేమ పేరుతో దాడులు చేస్తున్న ఘటనలు చూస్తునే ఉన్నాం. దీంతో కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయి. ప్రేమించలేదని దాడులు చేయవద్దు. ఇలాంటివి స్వచ్ఛమైన ప్రేమలో ఉండవు.

– అధ్యక్ష్, ఎంబీబీఎస్ మొదటిసంవత్సరం

న్యూస్‌రీల్

మహేశ్‌గౌడ్, షబ్బీర్‌లకు ఘన స్వాగతానికి ఏర్పాట్లు





సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, పార్టీ సీనియర్ నేత షబ్బీర్‌అలీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ నెల 16న మొదటిసారి జిల్లాకు రానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, నగర అధ్యక్షుడు కేశ వేణు మంగళవారం తెలిపారు. స్వాగత యాత్ర నగర శివారులోని బోర్గాం(పి) నుంచి ప్రారంభమై వినాయక్‌నగర్, పులాంగ్, గోల్‌హనుమాన్ మందిరం, పెద్దబజార్, నెహ్రూ పార్క్, తిలక్ గార్డెన్, ఎల్‌ఐసీ చౌరస్తా మీదుగా ప్రగతినగర్‌లోని మున్నూరుకాపు కల్యాణ మండపం వరకు సాగుతుందని పేర్కొన్నారు. ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

16న 'మార్కెట్' బంద్

సుభాష్‌నగర్ : దేశవ్యాప్త కార్మికుల సమ్మె నేపథ్యంలో ఈ నెల 16న నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఎలాంటి వ్యాపార కార్యకలాపాలు నిర్వహించడం లేదని మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. 17న శనివారం, 18న ఆదివారం కావడంతో పసుపు క్రయవిక్రయాలు జరపబోమని పేర్కొన్నారు. 19వ తేదీ నుంచి పసుపు వ్యాపార లావాదేవీలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు. అలాగే పసుపు సీజన్ కావడంతో మార్కెట్‌యార్డులో సమయవేళలను మార్పులు చేసినట్లు ఆయన తెలిపారు. మార్కెట్‌యార్డులోనికి రైతుల పసుపు పంట ఉత్పత్తులను ఉదయం 6 నుంచి 10 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే అనుమతిస్తామని పేర్కొన్నారు. విన్నర్ లిస్టు 5వేల బస్తాల వరకు ఉంటే మధ్యాహ్నం 2 గంటలకు, 10వేల బస్తాల సరుకు ఉంటే 3 గంటలకు, 15వేల బస్తాల సరుకు ఉంటే సాయంత్రం 4 గంటలకు ప్రకటిస్తామని, తదుపరి కాంటాలు నిర్వహిస్తామన్నారు.

అధిక మోతాదులో యూరియా వాడొద్దు



వర్ని : రైతులు అధిక మోతాదులో యూరియా వాడొద్దని జిల్లా వ్యవసాయ అధికారి మాజిద్ హుస్సేన్ సూచించారు. యూరియా అధికంగా వాడితే తెగుళ్లు ఆశించే అవకాశం ఉందన్నారు. మంగళవారం వర్నిలోని గ్రోమోర్ ఎరువుల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. పీవోస్ మిషన్ల ద్వారానే ఎరువులు విక్రయించాలని సూచించారు. అంతకు ముందు తగిలేపల్లి శివారులో పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఏవో నగేశ్‌రెడ్డి, ఏఈవో అరుణ్ పాల్గొన్నారు.

అల్జాపూర్‌పై క్రమశిక్షణ చర్యలు?

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : బీజేపీ సీనియర్ నాయకుడు అల్జాపూర్ శ్రీనివాస్‌పై పార్టీ నాయకత్వం క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. పార్టీ లైన్‌కు వ్యతిరేకంగా అల్జాపూర్ వ్యవహరించినట్లు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల పార్టీ అధ్యక్షులు కులాచారి దినేష్, మోరేపల్లి సత్యనారాయణలు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు గంగాపురం కిషన్‌రెడ్డికి ఫిర్యాదులు చేశారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి సిట్టింగ్ ఎంపీ ధర్మపురి అరవింద్‌పై నేరుగా విమర్శలు చేయడం పట్ల వీరు ఫిర్యాదులు చేశారు. పైగా జగిత్యాల, కోరుట్ల నియోజకవర్గాల్లో ఎంపీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలకు రూపకల్పన చేసి అమలు చేశారంటూ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. పైగా ఒక కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా పురిగొల్పినట్లు ఫిర్యాదులో వివరించారు. పార్టీ అధినాయకత్వంతో సంబంధం లేకుండా తనకు తానే ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్నట్లు ప్రకటించడం పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో నేడో, రేపో పార్టీ చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం.

మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ బదిలీ

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు వచ్చాయి. ఆయన మహబూబ్‌నగర్ మున్సిపల్ కమిషనర్‌గా వెళ్తున్నారు. మహేశ్వర్‌రెడ్డి ఇక్కడ ఆరు నెలల పాటు విధులు నిర్వహించారు.

బడా రాంమఠ్ భూముల కబ్జాపై కలెక్టర్ ఆరా

నిజామాబాద్‌సిటీ : జిల్లా కేంద్రంలోని బడా రాంమఠ్ (గాజుల్‌పేట్)కు చెందిన భూముల కబ్జాపై కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆరా తీశారు. మంగళవారం దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సుప్రియను వివరాలు అడిగారు. మఠానికి చెందిన భూములు రికార్డుల్లో ఎన్ని ఎకరాలు ఉన్నాయి.. ఎంత కౌలుకు ఇచ్చారని ప్రశ్నించారు. మఠం కింద నిజామాబాద్‌లో 200 ఎకరాలు, ఆదిలాబాద్‌లో 117 ఎకరాలు, నాందేడ్(మహారాష్ట్ర)లో 183 ఎకరాల భూమి ఉన్నాయని కలెక్టర్‌కు వివరించినట్లు ఏసీ తెలిపారు. కబ్జాలకు గురైన భూములను స్వాధీనం చేసుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను సహాయ కమిషనర్ కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో వివిధ మండలాల్లో మఠం భూములు ఉండగా, వాటిని గుర్తించేందుకు రెవెన్యూ అధికారులను ఆదేశిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌లో 400 ఎకరాలు కబ్జాకు గురైనట్లు గుర్తించామన్నారు. ఈ భూముల లెక్క పూర్తిగా తేలే సర్వే ఆపకూడదని దేవాదాయ శాఖ సిబ్బందిని కలెక్టర్ ఆదేశించారు. మఠం మేనేజర్ విజయ్‌కుమార్, సహాయ మేనేజర్ సురేష్‌కుమార్ కౌలు డబ్బులు, ఆలయాలకు వచ్చిన ఆదాయం బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయకుండా, లెక్కలు చూపడం లేదని, వీరిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని సుప్రియ కలెక్టర్‌కు తెలిపారు.

ఇంటెలిజెన్స్ దృష్టి..

బడా రాం మఠ్‌కు చెందిన భూముల కబ్జాలపై ఇంటెలిజెన్స్ వర్గాలు ఆరా తీస్తున్నట్లు సమాచారం. రాం మందిరానికి చెందిన మొత్తం భూములు ఎన్ని, కౌలుకు ఇచ్చిన భూములు, కబ్జాకు గురైన భూములు, ఆలయాలకు వస్తున్న ఆదాయంపై వివరాలు సేకరిస్తున్నట్లు తెలిసింది. అలాగే ఈ కబ్జాల వెనుక ప్రజాప్రతినిధుల పాత్ర ఉండటంపై ఆరా తీస్తున్నట్లు సమాచారం.

నేడు వసంత పంచమి

నిజామాబాద్ సిటీ : వసంత పంచమి అన్ని శుభకార్యాలకు మంచిరోజు కావటంతో బుధవారం ఉమ్మడి జిల్లాలో భారీగా వివాహాలు జరగనున్నాయి. చదువుల తల్లి సరస్వతి మాత పుట్టినరోజు వసంతి పంచమిగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. నగరంలోని కోటగల్లి సరస్వతి శిశుమందిరం పాఠశాలలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ర్యాలీలో పాల్గొన్న జిల్లా జడ్జి సునీత, సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్ నాగారం : ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జిల్లా జడ్జి సునీత కుంచాల సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం మేఘన ఇనిస్టిట్యూట్ ఆఫ్ డెంటల్ సైన్స్ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా జడ్జి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన కార్యక్రమంలో జిల్లా జడ్జి మాట్లాడారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని సూచించారు. సీపీ కల్మేశ్వర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. వాహనదారులు సీట్ బెల్ట్ ధరించాలని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దని సూచించారు. డాక్టర్ సాయిచంద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ముఖానికి గాయాలైతే మేఘన దంత వైద్య కళాశాలలో తక్కువ ఖర్చుతో చికిత్స అందిస్తున్నట్లు చెప్పారు. అదనపు డీసీపీ జయరాం, ప్రొబెషనరీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, నిజామాబాద్ ఏసీపీ కిరణ్‌కుమార్, హోమ్‌గార్డ్స్ ఏసీపీ అరుణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ వెంకట్‌నారాయణ, ఆర్‌ఐ సతీష్, డాక్టర్లు కల్యాణ చక్రవారి, అమర్నాథ్, ప్రవీణ్‌కుమార్, శోభారాణి, రమణరావు, వర్షానిహంత్ పాల్గొన్నారు.

'పీఎం విశ్వకర్మ'ను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్ : సంప్రదాయ చేతివృత్తుల వారిని, హస్త కళాకారులను ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం అమల్జేస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన(పథకం)ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సూచించారు. పీఎం విశ్వకర్మ పథకంపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం ఎంఎస్‌ఎంఈ (మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్), జిల్లా పరిశ్రమల కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్‌లో ఎలా దరఖాస్తు చేసుకోవాలనే దానిపై అవగాహన కల్పించారు. అర్హులను ఎంపిక చేసి 7 నుంచి 15 రోజుల వరకు శిక్షణ అందిస్తామని, శిక్షణ కాలంలో రోజుకు రూ.500 చొప్పున స్టైఫండ్ చెల్లిస్తారని వివరించారు. శిక్షణ పూర్తి చేసుకుంటే ధ్రువీకరణ పత్రం, గుర్తింపు కార్డు జారీ చేస్తారన్నారు. అంతేకాకుండా వృత్తి పరికరాలు సమకూర్చుకునేందుకు వీలుగా టూల్ కిట్ కోసం రూ.15,000 ఆర్థిక సాయం అందిస్తారని తెలిపారు. లబ్ధిదారులు కేవలం ఐదు శాతం వడ్డీపై రుణ సదుపాయం పొందవచ్చని కలెక్టర్ వివరించారు. విశ్వకర్మల వస్తువులకు మార్కెటింగ్ వసతి లభించేలా ఎంఎస్‌ఎంఈ కృషి చేస్తుందన్నారు. ఈ పథకంపై గ్రామాల్లో ప్రచారం చేస్తూ అర్హులైన వారు ప్రయోజనం పొందేలా చొరవ చూపాలని సీఎస్‌సీ కేంద్రాల ఆపరేటర్లు, పంచాయతీ కార్యదర్శులకు కలెక్టర్ సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్, ఎంఎస్‌ఎంఈ అధికారి రాజేష్ యాదవ్, బీసీ సంక్షేమ శాఖ అధికారి రమేష్, సిద్దయ్య, సీఎస్‌సీ జిల్లా మేనేజర్ మ్యాకల గౌతమ్ పాల్గొన్నారు.

ఈసీ నిర్ణయాలు అమలయ్యేనా?

- తెలంగాణ వర్సిటీలో ఇంకా గందరగోళమే!
- హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌కు తప్పుడు సమాచారంపై సీరియస్
- చార్జ్ మెమోలు జారీ చేయాలని పాలకమండలి తీర్మానం
- ఇంత జరిగినా కనకయ్యను కీలక పదవిలో కూర్చోబెట్టే ప్రయత్నాలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : గత రెండేళ్లకు పైగా అవినీతి, అక్రమాలు, నియామకాల విషయంలో పరువు బజారుపాలైన తెలంగాణ విశ్వవిద్యాలయంలో ఇప్పటికీ గందరగోళం వీడలేదు. పాలకమండలి తీసుకున్న నిర్ణయాలు, చేసిన తీర్మానాలను అమలు చేసే పరిస్థితి లేకుండా కుట్రలు జరుగుతుండడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు రెండేళ్ల కాలంలో 53 నుంచి 63 వరకు పాలకమండలి సమావేశాలు జరిగాయి. అయితే ఈ సమావేశాల్లో ఈసీ తీసుకున్న నిర్ణయాలను, చేసిన తీర్మానాల్లో ఒక్కటి కూడా అమలు చేయకపోవడం విశేషం. తాజాగా ఈ నెల 7న రాష్ట్ర సచివాలయంలో 63వ పాలకమండలి సమావేశం జరిగింది. వీసీ ఎంపిక కోసం వర్సిటీ నుంచి సెర్చ్ కమిటీ నామినీని ఎంపిక చేశారు. ఈ క్రమంలో మరికొన్ని అంశాలపై చర్చ చేసి తీర్మానాలు చేశారు. ఇందులో కీలకమైన అంశాలపై పాలకమండలి సభ్యులు నిర్ణయాలు తీసుకున్నారు. అయితే పాలకమండలి తీర్మానాలను ఇప్పటివరకు ఒక్కటి కూడా అమలు చేయని నేపథ్యంలో తాజాగా తీసుకున్న నిర్ణయాలను ఏమేరకు అమలు చేస్తారనే విషయమై సందిగ్ధత నెలకొంది. ఈసీ చేసిన తీర్మానాల అమలు సంగతి అటుంచితే అసలు మినిట్స్‌ను యథాతథంగా రాస్తున్నారా ? అనేది ప్రశ్నార్థకంగా తయారైందని విద్యార్థి సంఘాలు అంటున్నాయి. 2021 డిసెంబర్ 21న వర్సిటీ ఈసీ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను సైతం ఇప్పటివరకు అమలు చేయలేదు. తరువాత రిజిస్ట్రార్‌గా వచ్చిన శివశంకర్ ఆ దిశగా ప్రయత్నం చేసినప్పటికీ పలు అడ్డంకులు ఎదురయ్యాయి.

ఇంత డ్రామా నడిచిన నేపథ్యంలో తాజాగా జరిగిన పాలకమండలి సమావేశంలో కనకయ్యను ఎగ్జామినేషన్ కంట్రోలర్‌గా గానీ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపల్‌గా నియమించేందుకు రిజిస్ట్రార్ యాదగిరి ప్రతిపాదన పెట్టగా ఇన్‌చార్జి వీసీగా ఉన్న ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం సీరియస్ అయ్యారు. ఈసీ తీర్మానాల అమలు విషయమై యాదగిరిని 'సాక్షి' వివరణ కోరగా ఆలోచించి ముందుకు వెళతామని చెప్పడం గమనార్హం.



■ వివిధ విడతల్లో జరిగిన పాలకమండలి సమావేశాల్లో మాజీ ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు కనకయ్య, విద్యావర్ధినిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానాలు చేయగా.. అమలు చేయకపోవడం గమనార్హం. పైగా ఈసీ సభ్యుల నిర్ణయాలకు వ్యతిరేకంగా ఏడుగురు ప్రోగ్రామర్లకు బదులు 8 మందికి వేతనం పెంచేలా ప్రయత్నం జరగడం విశేషం. ఈ నేపథ్యంలో తాజా ఈసీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను యథాప్రకారం పొందుపరుస్తారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

■ తమ అవసరాల కోసం కొందరు ఇంటర్నల్ ఈసీ సభ్యులు ప్రోగ్రామర్స్ విషయంలో రిజిస్ట్రార్ యాదగిరికి వ్యతిరేకంగా మాట్లాడడం లేదని తెలుస్తోంది. ఇక తాజాగా పాలకమండలి సమావేశంలో.. యూసీజీ నిబంధనలను ఉల్లంఘించి అడ్డదారిలో పదోన్నతి పొందిన ప్రొఫెసర్ కనకయ్య హైకోర్టును తప్పుదోవ పట్టించిన విషయం, ఈ విషయాన్ని అప్పటి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ సైతం సక్రమమేనని హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్‌కు తప్పుడు సమాచారం ఇచ్చిన నేపథ్యంలో చర్యలు తీసుకునేందుకు పాలకమండలి నిర్ణయించింది. ఈ క్రమంలో వీళ్లిద్దరికీ చార్జ్ మెమోలు ఇవ్వాలని ఈసీ సభ్యులు తీర్మానించారు. అయితే దీన్ని షోకాజ్ కిందకు మార్చే ప్రయత్నం జరుగుతోందని విద్యార్థి సంఘాల నాయకులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా స్టాండింగ్ కౌన్సిల్‌కు రిప్రజెంట్ చేసిన విద్యావర్ధిని అప్పటి వైస్ చాన్స్‌లర్ చెప్పమంటేనే చెప్పానని ఒప్పుకోవడం గమనార్హం.

త్వరలోనే రామరాజ్యం

- ఎంపీ అర్వింద్ ధర్మపురి
- అయోధ్యకు ప్రత్యేక రైలును ప్రారంభించిన ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్ : దేశంలో త్వరలోనే రామరాజ్యాన్ని చూస్తామని ఎంపీ అర్వింద్ ధర్మపురి పేర్కొన్నారు. మంగళవారం నిజామాబాద్ నుంచి అయోధ్యకు బయలుదేరిన ప్రత్యేక ఆస్తా రైలును నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణతో కలిసి ఎంపీ జెండా ఊపి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ.. హిందువుల 500 ఏళ్ల కల, ఎంతోమంది కరసేవకుల త్యాగ ఫలం అయోధ్యలో రామమందిరం అన్నారు. జిల్లా నుంచి బాల రాముడిని దర్శించుకునేందుకు 1,344 మంది రామభక్తులు, బీజేపీ శ్రేణులు వెళ్లారని తెలిపారు. రాముని ఆశీర్వాదం బీజేపీ శ్రేణులకు లభిస్తోందన్నారు. రైల్వే చరిత్రలో మొదటిసారి కాషాయజెండా ఊపిన తర్వాత రైలు కదిలిందని, రామరాజ్య స్థాపనకు బాటలు పడ్డాయని పేర్కొన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రత్యేక ట్రైన్ ఆస్తా సికింద్రాబాద్ నుంచి బయలుదేరనుండగా, నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక చొరవ తీసుకుని నిజామాబాద్ నుంచి వెళ్లే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రతి హిందువు బాల రాముడిని దర్శించుకోవాలన్నారు. భక్తులకు ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్తా ట్రస్ట్ ద్వారా ఉచిత భోజనం, వాటర్ బాటిళ్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డి, బోగ శ్రావణి, నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి అయోధ్య రైలును ప్రారంభిస్తున్న ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

క్లుప్తంగా

వీడీసీపై సీపీకి ఫిర్యాదు



ఖలీల్‌వాడి: జరిమానా డబ్బులు రూ.25వేలు జమ చేయకపోవడంతో గ్రామస్తులు ఎవరూ తమ వద్ద కల్లుతాగొద్దని వీడీసీ ఆదేశించిందని కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లికి చెందిన గౌడ కులస్తులు సీపీ కల్మేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన గౌడకులస్తులు వీడీసీపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమవద్ద కల్లు తాగినవారికి రూ.5వేలు జరిమానా విధిస్తామని కుల సంఘాల నాయకులను వీడీసీ హెచ్చరించిందని తెలిపారు. కొద్దిరోజులుగా తమ వద్ద ఎవరూ కల్లుతాగకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు విచారణ చేపట్టి తమకు న్యాయం చేయాలని కోరారు.

రెండు కుటుంబాల ఘర్షణ

● బిందె చోరీ అయ్యిందనే కారణంతో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నీటి బిందె చోరీ విషయంలో మండలంలోని సిర్‌పూర్‌లో రెండు కుటుంబాలు మంగళవారం ఘర్షణపడ్డాయి. పోలీసులు, గ్రామస్తులు తెలిసిన వివరాల ప్రకారం కాలనీలోని తస్లీమాకు చెందిన నీటి బిందెను లకావత్ పూలబంతి దొంగిలించిందని గొడవ మొదలైంది. ఈ క్రమంలో పూలబంతి కుమార్తె లకావత్ లక్ష్మి అక్కడికి చేరుకోగా, గొడవ కాస్త ఘర్షణకు దారితీసింది. లక్ష్మిపై తస్లీమా, సుల్తానాతోపాటు ఆమె భర్త దాడి చేశారు. దాడిలో లక్ష్మి తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్స్

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్ కొనసాగుతున్నాయని జిల్లా ఇంటర్ విద్యాధికారి రఘురాజ్ తెలిపారు. మంగళవారం ఉదయం 1,230 మంది జనరల్ విద్యార్థులకుగాను 1,197 మంది హాజరుకాగా 33 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 221 మందికిగాను 206 మంది విద్యార్థులు హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన ప్రాక్టికల్స్‌లో 951మంది జనరల్ విద్యార్థులకుగాను 914 మంది హాజరుకాగా 37మంది గైర్హాజరయ్యారు. అలాగే ఒకేషనల్‌లో 247 మంది విద్యార్థులకుగాను 228 మంది హాజరు కాగా 19 మంది గైర్హాజరయ్యారు. డీఐఈవో ఐదు సెంటర్లను, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 23 పరీక్షాకేంద్రాలను తనిఖీ చేశారు.

అడిషనల్ కలెక్టర్‌ని కలిసి డీఐఈవో



అడిషనల్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కిరణ్‌కుమార్‌ను డీఐఈవో రఘురాజ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండల కేంద్రం నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం రాత్రి పట్టుకున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు నిఘా ఏర్పాటు చేసి ట్రాక్టర్లను పట్టుకున్నామని, చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చామన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో మెరిసిన విద్యార్థులు

కాకతీయకు ర్యాంకుల పంట

- వరుసగా మూడోఏడాదీ ర్యాంకులు
- హ్యాట్రిక్ సాధించామన్న విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు

నిజామాబాద్‌అర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఏడాది కూడా కాకతీయ కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన 17 మంది విద్యార్థులు 90శాతానికి పైగా పర్సన్‌టైల్ సాధించి సత్తా చాటారు. వరుసగా మూడో ఏడాది కూడా రాష్ట్ర, జిల్లా స్థాయి ర్యాంకులు సాధించారు. ప్రస్తుత ఫలితాల్లో కళాశాలకు చెందిన ఎండీ మిన్హాజ్ 99.68శాతం, ఎం సుప్రీత్ 99.41, బి శివప్రతామ్ 99.22, అబ్దుల్ హదీ 98.22, అబ్దుల్ మాలిక్ 97.42, జే.కేతన 97.41, అనీశ్ కుర్దుకర్ 97.01, పి మణికంఠ 94.65, ఇజన్ తహమి 94.51, తట్టపల్లి రిషిక్‌సాయి 94.48, అఖిలేశ్ దోర్నాల 93.95, అజ్మీర తేజస్విని 93.50, లోకేశ్ 93.34, వి సాయి వరుణ్ 92.39, భార్గవ్‌సాయి 91.63, కౌశల్ 91.05, ఎండీ తయ్యబ్ అలీ 90.48 పర్సన్‌టైల్ సాధించారు. మిన్హాజ్ జిల్లాస్థాయి మొదటి, సుప్రీత్ రెండో, శివప్రతాప్ మూడో ర్యాంకు సాధించారు. అంతేకాకుండా ఐఐటీ అడ్వాన్స్‌కి 50 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు కళాశాల డైరెక్టర్ రామోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభకనబరిచారన్నారు. విద్యార్థులతోపాటు అధ్యాపకబృందానికి అభినందనలు తెలుపుతున్నామన్నారు. 2022 నుంచి తమ కళాశాల విద్యార్థులు సాధిస్తున్న ర్యాంకులు హ్యాట్రిక్ విజయానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో కళాశాల చైర్‌పర్సన్ విజయలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.



సుప్రీత్



అబ్దుల్ హది



అనీశ్ కుర్దుల్‌కర్

కేవోఎస్ స్కూల్ పునాది



కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదవడం వల్లే ర్యాంకు సాధించాను. పాఠశాల స్థాయిలో మెరుగైన విద్య అందించారు. ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ పేరుతో నా మిత్రులు వేరే కళాశాలలో చేరి నష్టపోయారు. నేను మాత్రం ఉత్తమ ర్యాంకు సాధించడం గర్వంగా ఉంది.

– మిన్హాజ్, జిల్లాస్థాయి మొదటి ర్యాంకు

ఫౌండేషన్ వల్లే సాధించాను



కేవోఎస్ ఫౌండేషన్ ఎంతో ప్రయోజనం చేకూర్చింది. ఆ కారణంగానే ఈ రోజు జాతీయస్థాయి ర్యాంకు సాధించాను. మొదటి నుంచే ఐఐటీ, నీట్ శిక్షణ ఇవ్వడం వల్ల ఎంతో మేలు జరిగింది. ఎలాంటి భయం లేకుండా పరీక్షకు హాజరై మంచి ర్యాంకు సాధించాను. ఫౌండేషన్ వల్లే సాధించాను

– శివప్రతమ్, జిల్లాస్థాయి మూడో ర్యాంకు

ఎస్‌ఆర్ విద్యార్థుల ప్రతిభ

నిజామాబాద్‌అర్బన్: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు జాతీయస్థాయిలో ఉత్తమ ప్రతిభకనబర్చినట్లు కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తెలిపారు. ఉత్తమ పర్సన్‌టైల్ సాధించిన విద్యార్థులను కళాశాలలో మంగళవారం అభినందించారు. ఎం శ్రీవల్లి 99.42, సురేశ్‌కుమార్ 98.75, మేఘన 98.49, భవ్య 96.12, చంద్రవర్ధన్ 95.20, అక్షయ్‌రెడ్డి 95.16, భవాని 94.6, అంకుల్ 93.63, వరుణ్ 92.90, రిషిరాజ్ 91.44, ప్రవీణ్‌కుమార్ 90.8, వరుణ్‌కుమార్ 90.6, అజయ్‌సాయి 90.45 పర్సన్‌టైల్ సాధించినట్లు ఆయన తెలిపారు. 13 మంది విద్యార్థులు 90 పర్సన్‌టైల్‌ను అధిగమించారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయస్థాయి విద్యావ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా అకడమిక్ ప్రోగ్రాం, టీచింగ్ షెడ్యూల్ మారుస్తూ సీనియర్ అధ్యాపకులతో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ విజయానికి కారకులైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. ఎస్‌ఆర్ విద్యాసంస్థల డీజీఎం గోవర్ధన్‌రెడ్డి, జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్, అకడమిక్ జోనల్ ఇన్‌చార్జి ప్రదీప్‌రెడ్డి, ప్రిన్సిపల్ అఖేందర్ రెడ్డి, శ్రీధర్, సత్యం, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్

క్షత్రీయ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని క్షత్రీయ జూనియర్ కళాశాల విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల సెక్రెటరీ అల్జాపూర్ దేవేందర్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి చౌల్ శ్రీనాథ్ 93.04శాతం, మెకల పూజిత 87.81 శాతం మార్కులు సాధించారన్నారు. వారిని ఉపాధ్యాయులు అభినందించారు.



చౌల్ శ్రీనాథ్ (93.04) పర్సన్‌టైల్



మేకల పూజిత (87.81)

సైంటిస్ట్‌నవుతా



బొత్తమొల్ల చరణ్

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లికి చెందిన బొత్తమొల్ల చరణ్ జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.99 పర్సన్‌టైల్‌తో 290 మార్కులు సాధించాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన బొత్తమొల్ల వెంకట్ నర్సయ్య, లత దంపతుల మొదటి సంతానమైన చరణ్ చిన్నప్పటి నుంచి చదువులో ముందుండేవాడు. ఇంటర్మీడియెట్ హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో చదివాడు. ముందుగా ఐఐటీ ముంబయిలో సీటు సాధిస్తానని, తరువాత సైంటిస్టు కావడమే లక్ష్యమని చరణ్ తెలిపాడు.

స్వచ్ఛమైన ప్రేమకే..



'సాక్షి' డిబేట్‌లో పాల్గొన్న ఎంబీబీఎస్ విద్యార్థులు

నిజామాబాద్‌నాగారం: ప్రేమకు అవధులు ఉండవని, ప్రేమంటే 'బాధ్యత' అని కాబోయే వైద్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కెరియర్ తరువాతే ఏదైనా అంటున్న మెడికోలు.. ప్రేమికుల రోజును పురస్కరించుకొని 'సాక్షి' నిర్వహించిన డిబేట్‌లో తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

మంచి, చెడు రెండూ ఉంటాయి



ప్రేమలో మంచి, చెడు రెండు ఉంటాయి. వాటిని గుర్తించి ముందుకు వెళ్లాలి. మానసికంగా సరిగా ఉన్నప్పుడే ఒకరినొకరు అర్థం చేసుకోగలరు. కొన్నిరోజులుగా మంచిగా, మరికొన్ని రోజులు చెడుగా ఉండొచ్చు. పరిస్థితులను అర్థం చేసుకొని ముందుకు వెళ్లాలి. మంచి, చెడును బేరీజు వేసుకోవాలి.

– పల్లవి, ఎంబీబీఎస్ సెకండియర్

ఎక్కువైతే ఇబ్బందులు



ఏదైనా కావాల్సిన దానికంటే ఎక్కువైతే ఇబ్బందులు తప్పవు. పాలు మంచివని ఎక్కువ తాగితే డయేరియా వస్తుంది. ప్రేమలో కూడా అతి పనికిరాదు. ప్రేమ తప్పుకాదు. ప్రేమ పేరుతో జీవితాన్ని నాశనం చేసుకోవద్దు. కెరియర్ బాగుండాలంటే కచ్చితంగా అన్ని విషయాల్లో లిమిట్స్‌లో ఉండాల్సిందే.

– కావ్యశ్రీ, ఎంబీబీఎస్ సెకండియర్

లక్ష్యం పక్కకుపోయే ప్రమాదం



ప్రస్తుత సమాజంలో చాలా మంది ప్రేమ పేరుతో ఫిజికల్ రిలేషన్‌లో ఉంటున్నారు. ప్రేమిస్తున్నామంటూ ఫిజికల్‌రిలేషన్‌లో ఉండడంతో అమూల్యమైన జీవితాలు నాశనమవుతున్నాయి. మనముందున్న లక్ష్యం పక్కకు పోయే ప్రమాదం ఉంది. వీటికి సాధ్యమైనంత వరకు దూరంగా ఉంటా.

– విశాల్ సెహ్రా, ఎంబీబీఎస్ సెకండియర్

ఎమోషన్స్ ఎక్కువ



ప్రేమలో ఎక్కువగా ఎమోషన్స్ ఉంటాయి. అయినా వీటిని తట్టుకోవాల్సిందే. కుటుంబంలోని ప్రతి బంధంలో అన్నా, తమ్ముడు, అక్క, అమ్మానాన్న ఇలా ప్రతి బంధంలో ఎమోషన్లు ఉంటాయి. ఆలోచించే శక్తి ఎక్కువే. అందుకే కెరియర్ తర్వాతే ఏదైనా అన్న నిర్ణయంతో ముందుకు వెళ్లాలి.

– లహరి, ఎంబీబీఎస్ సెకండియర్

ప్రేమ అనంతం



ప్రేమ అనేది అనంతం. అమ్మానాన్న, తోబుట్టువులు, స్నేహితులు ఇలా ఎవరితోనైనా ప్రేమగా ఉండొచ్చు. ప్రేమ పేరుతో అనవసర రిలేషన్ పెట్టుకోవద్దు. ప్రేమ పేరుతో పెళ్లిలు చేసుకొని చిన్నచిన్న కారణాలతో విడాకులు తీసుకుంటున్నారు.

– నితీశ్, ఎంబీబీఎస్ సెకండియర్

సమయం వృథాచేయొద్దు



ప్రేమ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. ప్రేమ అంటే కేవలం ఇద్దరికి మాత్రమే కావాలి. కలిసి జీవించాలంటే ప్రేమతో పాటు డబ్బు అవసరం. అందుకే ప్రేమ పేరుతో సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యాన్ని సాధించిన తరువాతే ప్రేమ, పెళ్లి గురించి ఆలోచించాలి.

– ఆయుధ, ఎంబీబీఎస్ సెకండియర్

వివాదాస్పద స్థలం పరిశీలన

వేల్పూర్: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా సమీపంలో వివాదాస్పదంగా మారిన స్థలాన్ని ఎంపీ ధర్మపురి అర్వింద్ మంగళవారం పరిశీలించారు. స్థలానికి సంబంధించిన వివరాలు, రెండు వర్గాల మధ్య జరిగిన సంఘటనల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వివాదాస్పద స్థలం విషయంలో పోలీసులు ఓ వర్గానికి వత్తాసు పలికారని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ఆర్‌అండ్‌బీ ప్రధాన రహదారి నుంచి 50 ఫీట్లు వదిలి నిర్మాణం చేయాల్సి ఉండగా, స్థలం వదలకుండా నిర్మాణం చేపట్టారన్నారు. దానిని వ్యతిరేకించిన 40 మంది గ్రామస్తులపై పోలీసులు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. అధికారులు, పోలీసులు ఒకే వర్గానికి కొమ్ముకాస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆయన వెంట పార్టీ నాయకులు మల్కన్నగారి మోహన్‌రెడ్డి, ఏలేటి రమేశ్‌రెడ్డి, బద్దం రాజారెడ్డి, మాజీ సర్పంచ్ తీగెల రాధామోహన్, ఎంపీటీసీ మొండి మహేశ్, మాజీ ఉపసర్పంచ్ పిట్ల సత్యం, గ్రామస్తులున్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్

సీడీపీవో విచారణ

ఎడపల్లి(బోధన్): మండలంలోని ఎమ్మెస్సీఫారం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్(బోధన్) సీడీపీవో, సూపర్ వైజర్ విజయలక్ష్మి మంగళవారం విచారణ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం భోజనం పెడుతున్నారని, చిన్నారులు అస్వస్థతకు గురవుతున్నారని స్థానికులు అధికారులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. మాజీ సర్పంచ్ విజయ్‌కుమార్, ఫిర్యాదుదారులు, గ్రామస్తుల సమక్షంలో విచారణ చేపట్టగా, గ్రామానికి చెందిన ఓ విద్యార్థి అస్వస్థతకు గురికావడం, శారీరకంగా ఎదుగుదల లేకపోవడానికి అంగన్‌వాడీ భోజనం కారణం కాదని తేలింది. సదరు విద్యార్థి వేరే కారణాలతో అస్వస్థతకు గురైనట్లు సీడీపీవో తెలిపారు. అంగన్‌వాడీలో నాణ్యమైన భోజనం అందిస్తున్నట్లు విచారణలో తేలింది.

అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

సుభాష్‌నగర్: రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యం రైస్‌మిల్లులకు కేటాయింపులో అవకతవకలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో సివిల్ సప్లయీస్ కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైస్‌మిల్లర్లకు ధాన్యం కేటాయింపుల్లో అవకతవకలు జరిగాయని గతంలో తాను వినతిపత్రం అందజేశానని, ఇప్పటివరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అవినీతికి పాల్పడిన అదనపు కలెక్టర్, డీఎస్‌వోపై రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఐదారు మిల్లులపై కేసులు పెట్టి చేతులు దులుపుకున్నారని, జిల్లా అధికారులు, రైస్‌మిల్లర్లు కుమ్మక్కై ధాన్యాన్ని దోపిడీ చేశారని ఆరోపించారు. విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ చేయించకపోవడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో జరిగిన అవకతవకలపై నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, కేంద్ర విజిలెన్స్‌కు నివేదికలు పంపించి అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని దేవీ విహార్‌కాలనీ వద్ద టీవీఎస్ ఎక్సెల్‌ను వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో తాడ్వాయి మండలం దేవాయిపల్లికి చెందిన బుయ్య మల్లయ్య(51) మృతి చెందాడు. మంగళవారం చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. మల్లయ్య(51) ఆస్పత్రి పని నిమిత్తం ద్విచక్రవాహనంపై కామారెడ్డికి వస్తుండగా, దేవీవిహార్ వద్ద వెనుక నుంచి అతివేగం, అజాగ్రత్తగా వచ్చిన డీసీఎం ఢీకొట్టింది. ఈ ఘటనలో మల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. దేవునిపల్లి ఎస్సై రాజు ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

మృతుడి బంధువుల ఆందోళన

ప్రమాద విషయం తెలుసుకుని దేవాయిపల్లి నుంచి మృతుని కుటుంబసభ్యులు, బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలానికి చేరుకున్నారు. అజాగ్రత్తగా వాహనం నడిపి మల్లయ్య మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేసేందుకు రోడ్డుపై బైఠాయించగా, ఎస్సై రాజు వారిని సముదాయించారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అక్కడ నుంచి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, ముగ్గురు కుమారులు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పాట్కూరి

సుభాష్‌నగర్: భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా జక్రాన్‌పల్లి మండలం మనోహరాబాద్ మాజీ సర్పంచ్ పాట్కూరి తిరుపతిరెడ్డి నియమితులయ్యారు. ఎంపీ అర్వింద్ ఆయనకు జిల్లా కేంద్రంలో మంగళవారం నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి, ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్‌రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పెద్దోళ్ల గంగారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. తిరుపతిరెడ్డి రెండుసార్లు కొలిప్యాక్ సొసైటీ అధ్యక్షుడిగా, ఒకసారి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. రాష్ట్రంలోనే ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్ది ప్రధాని మోదీ చేతుల మీదుగా కేంద్ర ఉత్తమ జీపీ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం జిల్లా పసుపు రైతుల సంఘం అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలను ప్రజా స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా దత్తత తీసుకొని పైచదువులు చదివిస్తున్నారు. ఎర్రజొన్న, పసుపు రైతుల సమస్యలపై ఎన్నో ఏళ్లుగా ఉద్యమిస్తున్నారు. పసుపు బోర్డు, తెలంగాణ కోసం ఉద్యమించారు.



తిరుపతిరెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎంపీ అర్వింద్

అర్బన్ నియోజకవర్గ సమన్వయకర్తగా నాగోళ్ల లక్ష్మీనారాయణ

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత అంశాలను పర్యవేక్షించేందుకు నాగోళ్ల లక్ష్మీనారాయణను సమన్వయకర్తగా నియమించారు. ఎంపీ అర్వింద్ ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు దినేశ్‌కులాచారి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

బహిరంగ వేలము ప్రకటన

శ్రీరామ్ ఫైనాన్స్ లి. నిజామాబాద్ మరియు బాన్సువాడ శాఖల వారి ఈ క్రింద తెలుపబడిన వాహనములు బహిరంగ వేలము నిర్వహించబడును.

VEHICLE NO	MODEL	MFG YEAR
TS16UB 0307	MAHINDRA SUPRO MAXI TRUCK-T2	2016
TS16UB 6362	AL COMET CT 1616 FBT	2011
TS16FF 9043	MARUTHI SWIFT DZIRE	2017

SHRIRAM Finance

AUCTION DATES: 14.02.2024

SHRIRAM AUTOMALL INDIA LIMITED NIZAMABAD

H.No. 5-1, Aurgul Village, Jakranpally Mandal, Nizamabad Dist. Telangana - 503224, Cell: 7793999220, 9701878143

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్‌ప్లేట్స్ & LED మిషన్స్ పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం ✆ 9310515624, 8800496710 [G-1433]

CHANGE OF NAME

■ I, GANNARAM MAHESH (OLD NAME) Yellammagutta, NZB. Hence changed my name as RAMAGIRI MAHESH, S/o. LAXMAN (NEW NAME) [Z-795664]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233785]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899. [H-793691]

■ రామకృష్ణ గ్రూప్ (A.P,TS & న్యూఢిల్లీ నెం.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవ, ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ఫోన్: 9281465286 / 8247500952. [H-787794]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి నిజామాబాద్ CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నీటమునిగి ఒకరి మృతి



నర్సింలు (ఫైల్)

కామారెడ్డి క్రైం: చేపలు వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చిన్నమల్లారెడ్డికి చెందిన బాల్‌నర్సింలు (33) చేపల వేట, కూలీ పనులకు వెళ్లేవాడు. ఎప్పటిలాగే ఆదివారం మధ్యాహ్నం చేపలు పట్టేందుకు పక్కనే ఉన్న కామారెడ్డి పెద్ద చెరువుకు వెళ్లి రాత్రి వరకు తిరిగి రాలేదు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం చెరువు ప్రాంతంలో గాలించగా, ఒడ్డుపై చెప్పులు, దుస్తులు, సెల్‌ఫోన్ లభించాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినప్పటికీ ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయం మృతదేహం నీటిపై తేలడంతో పోలీసులు బయటికి తీయించి విచారణ చేపట్టారు. మృతుని తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

ధర్పల్లి: మండలంలోని మైలారంలో మూడు రోజులక్రితం గ్యాస్ లీకైన ఘటనలో వృద్ధ దంపతులు తీవ్రగాయాలపాలైన విషయం తెలిసిందే. 90శాతం గాయాలతో జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేండ్ల రాజన్న(69) పరిస్థితి విషమించి మంగళవారం సాయంత్రం మృతి చెందాడు.

ధాన్యం బస్తాల లారీ బోల్తా



నిజాంసాగర్(జుక్కల్): ధాన్యం బస్తాల లోడ్‌తో వెళ్తున్న లారీ మహమ్మద్‌నగర్ మండలంలోని నర్వ గ్రామ గేటు వద్ద మంగళవారం రాత్రి బోల్తాపడింది. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగంగా లారీ నడుపడటంతో రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీకొని బోల్తాపడింది. డ్రైవర్‌ను స్థానికులు క్యాబిన్ నుంచి బయటకు తీసి 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న నిజాంసాగర్ పోలీసులు వివరాలు సేకరించారు. ధాన్యం బస్తాలను ఎక్కడి నుంచి ఎక్కడికి తరలిస్తున్నారనే సమాచారం తెలియలేదు.

బస్సును ఢీకొన్న బైక్

● ఒకరికి తీవ్రగాయాలు

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): మండలంలోని బర్ధిపూర్ శివారులో డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సును వెనుక నుంచి బైక్ ఢీకొట్టింది. మంగళవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ఈ ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కామారెడ్డి జిల్లా రెడ్డిపేట్‌కు చెందిన సుధాకర్‌తోపాటు మరికొందరు మూడు బైక్‌లపై నిజామాబాద్‌కు వచ్చారు. గల్ఫ్ నుంచి వచ్చిన బంధువును వెంటబెట్టుకొని తిరిగి రెడ్డిపేట్‌కు బయల్దేరారు. కామారెడ్డి డిపో ఆర్టీసీ బస్సు బర్ధిపూర్ శివారులో సడెన్ బ్రేక్ వేయడంతో వెనుకాలే ఉన్న సుధాకర్ బైక్ బస్సు వెనుకభాగాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో సుధాకర్‌కు తీవ్రగాయాలు కాగా, ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.



భారతిది ఆత్మహత్య కాదు హత్య

■ పోలీసులకు ఏబీవీపీ నాయకుల ఫిర్యాదు

రామారెడ్డి(ఎల్లారెడ్డి): మండల కేంద్రానికి చెందిన విద్యార్థిని భారతిది ఆత్మహత్య కాదని, అది హత్యేనని ఏబీవీపీ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ చరణ్ మాట్లాడుతూ.. భారతిని హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, ఆమె హత్య వెనుక కన్నతండ్రితోపాటు కుటుంబ సభ్యుల పాత్ర ఉందని ఆరోపించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి తెలియని ప్రాంతానికి తీసుకెళ్లి పూడ్చిపెట్టారన్నారు. లోతుగా దర్యాప్తు చేయాలని ఎస్సై కొండ విజయ్‌ని కోరారు. అనంతరం బాలికల పాఠశాలలో విద్యార్థులతో కలిసి మౌనం పాటించి పాఠశాలను బంద్ చేయించారు. భారతికి న్యాయం జరిగే వరకు ఏబీవీపీ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా హాస్టల్స్ కన్వీనర్ ఖలీల్, జిల్లా ఫేల్ కన్వీనర్ రోహిత్, కార్యకర్తలు కళ్యాణ్, వెంకీ, అల్తాఫ్, మురళి తదితరులు పాల్గొన్నారు.



ఎస్సైకి ఫిర్యాదు చేస్తున్న ఏబీవీపీ నాయకులు